సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం, 18, జూలై, 2023



రూ.లక్ష విరాళం

ద్వారకా తిరుమల: శ్రీవారి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యురాలు నూకల అమ్మాజీ (ఏలూరు) చినవెంకన్న నిత్యాన్నదాన పథకానికి సోమవారం రూ.1,00,001 విరాళం సమర్పించారు.




రాత్రిపూట రక్తచరిత

ఇద్దరు దుర్మార్గులు రాత్రిపూట అలజడి రేపారు.. కత్తులతో భయానక వాతావరణం సృష్టించారు.. ఓ డ్రైవర్‌ను కత్తితో పొడవడమే కాకుండా మహిళను హత్య చేశారు.

- IIలో ▸

కడలిలోకి 49,600 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం 49,600 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 4 వేలు, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

థ్యాంక్యూ సీఎం సార్..

ఆర్టీసీ ఉద్యోగుల సంబరాలు



సీఎం జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేసిన ఆర్టీసీ డీఎం సత్యనారాయణమూర్తి, ఉద్యోగులు

అమలాపురం రూరల్: థ్యాంక్యూ సీఎం సార్ అంటూ సోమవారం అమలాపురం ఆర్టీసీ డిపో వద్ద ఉద్యోగులు సంబరాలు జరుపుకొన్నారు. రాష్ట్రంలో 53 వేల మంది ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడం, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన హయ్యర్ పెన్షన్ స్కీమ్‌కు అవకాశం కల్పించడంపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ సీఎం జగన్ చేసిన మేలుతో ఆర్టీసీ ఉద్యోగులు రిటైర్డ్ అయితే రూ.40 వేల వరకూ పింఛన్ అందుతుందన్నారు. 2014 నుంచి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులనూ హయ్యర్ పెన్షన్ స్కీమ్‌లో చేర్చడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నామని అన్నారు. అనంతరం సీఎం జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్ జీఆర్ఎల్ దేవి, అన్ని అసోసియేషన్ల ప్రతినిధులు, అడ్మినిస్ట్రేషన్ ట్రాఫిక్, గ్యారేజీ, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చమురు నిక్షేపాల వెలికితీతను వ్యతిరేకిద్దాం

ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు

మలికిపురం: కేజీ బేసిన్‌లో చమురు నిక్షేపాల వెలికితీతను వ్యతిరేకించాల్సిన సమయం ఆసన్నమైందని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. సోమవారం మలికిపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చమురు నిక్షేపాలు వెలికితీసి రాష్ట్ర ప్రజలకు మేలు చేస్తున్నామని కొన్ని సంస్థలు చేస్తున్న ప్రకటనలు బోగస్ అని, అవి కేవలం వ్యాపారులకే ప్రయోజనకరమని అన్నారు. గుజరాత్‌కు చెందిన వ్యాపారులు ఇతర రాష్ట్రాలలో పంటలను పండనివ్వరని, వారి ప్రయోజనాల కోసమే ప్రణాళికలు చేస్తారన్నారు. చమురు నిక్షేపాల వెలికితీతతో కోనసీమ నాశనం అవుతుందని, ఇక్కడ పంటలు పండడం లేదని తెలిపారు. అంతేకాకుండా భూమి కుంగి, సముద్ర నీటిమట్టం పెరిగి డ్రైన్లు సక్రమంగా పనిచేయడం లేదన్నారు. ఆయిల్ సంస్థలు ఇక్కడి స్థానికులకు గార్డు ఉద్యోగాలు తప్ప ఉన్నత ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేస్తున్నాయన్నారు. చమురు నిక్షేపాలు వెలికితీస్తున్న చోట గ్యాస్ ఉచితంగా స్థానికులకు ఇవ్వాల్సి ఉండగా అవేమీ జరగడం లేదన్నారు. కోనసీమను దోచేస్తున్న ఆయిల్ సంస్థలను ఇక వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. తక్షణమే పార్లమెంటరీ స్టాండింగ్, నిపుణుల కమిటీలు వేసి నివేదిక తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కోనసీమ రైల్వే లైన్ ఏర్పాటులో రాష్ట్రం వాటా ఇవ్వాల్సిన అవసరం ఏంటని ఆయన ప్రశ్నించారు. రైల్వే లైన్ ఏర్పాటు వల్ల ఆదాయం కేంద్రానికే వస్తుందన్నారు. అందుకు దాని పూర్తి బాధ్యత కేంద్రమే తీసుకోవాలన్నారు.

వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ గ్యాస్ వాడొద్దు

రాజమహేంద్రవరం రూరల్: గృహావసర సిలిండర్లను వాణిజ్య ప్రయోజనాలకు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఇన్‌చార్జి రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.కుమార్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లాలోని పలు హోటళ్లలో డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్య ప్రయోజనాలకు ఉపయోగిస్తున్నారన్న సమాచారంతో విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులతో కలసి ఆయన తనిఖీలు నిర్వహించారు. కుమార్ మాట్లాడుతూ తొర్రేడులోని ఎస్ఎస్ ఫుడ్స్‌లో తనిఖీలు చేయగా 15 గృహావసర సిలిండర్లను గుర్తించామన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని, హోటల్ యజమాని పాతూరి సుబ్రహ్మణ్యంపై కేసు నమోదు చేశామని తెలిపారు. కడియం మండలం పొట్టిలంక గ్రామంలో గ్రంధి వీవీఎస్ శ్రీనివాస్ టిఫిన్స్, కిరాణా షాపులో ఐదు డొమెస్టిక్ సిలిండర్లు స్వాధీనం చేసుకుని, యజమాని శ్రీనివాస్‌పై కేసు పెట్టామన్నారు. ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరెడ్డి, రమేష్, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, తహసీల్దార్ విజయకుమార్, ఎంఎస్‌వో ప్రభాకర్, వీఆర్‌ఓ కోన శ్రీనివాస్, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

రయ్యిన సాగిపోదాం..

- ఇక హాయి హాయిగా ప్రయాణం
- ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి రూ.62.45 కోట్లు
- నెలాఖరుకు టెండర్ల ప్రక్రియ

సాక్షి, అమలాపురం: జిల్లాలో రోడ్లపై ప్రయాణం సుఖవంతం కానుంది.. రహదారులపై హాయిగా సాగిపోవడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.. ఇందులో భాగంగా రోడ్లు భవనాల శాఖ పరిధిలో ప్రధాన రహదారుల మరమ్మతులు, ఆధునీకరణకు భారీగా నిధులు కేటాయించింది. ఆర్‌అండ్‌బీ పరిధిలోని స్టేట్ హైవేస్, జిల్లా పరిధిలోని ప్రధాన రహదారులపై ప్రమాద రహిత ప్రయాణానికి మార్గం సుగమమైంది. కీలక రహదారులకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. కోనసీమ జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో 62.127 కిలోమీటర్ల మేర రోడ్ల మరమ్మతులు, ఆధునీకరణకు ప్రభుత్వం రూ.28.55 కోట్లు కేటాయించింది. అలాగే జిల్లా పరిధిలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో 101.596 కిలోమీటర్ల మేర ప్రధాన రోడ్లకు రూ.33.90 కోట్లు మంజూరు చేసింది. స్టేట్ హైవేలు, జిల్లా ప్రధాన రహదారులు కలిపి 163.723 కి.మీ. మేర మరమ్మతులు, ఆధునీకరణకు రూ.62.45 కోట్లు సమకూర్చింది. ఈ నిధులతో పనులు చేపట్టేందుకు ఈ నెలాఖరు నాటికి టెండర్లు పిలవాలని ఆర్‌అండ్‌బీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

నియోజకవర్గాల వారీగా ప్రధాన రోడ్లకు ఇలా..

రాజోలు: కేశవదాసుపాలెం- కేశనపల్లి, కూనవరం - కేశనపల్లి మార్గంలో 13.6 కిలోమీటర్ల రోడ్డుకు రూ.4.10 కోట్లు, చింతపల్లి వంతెన నుంచి మలికిపురం వరకూ 2.8 కి.మీ.కి రూ.మూడు కోట్లు, మామిడికుదురు – గోగన్నమఠం 7.66 కి.మీ. రోడ్డుకు రూ.2.10 కోట్లు.

మండపేట: చెల్లూరు నుంచి అచ్యుతాపురం వరకూ 4 కి.మీ., నల్లూరు నుంచి చెల్లూరు వరకూ 4.7 కి.మీ. రోడ్డు ప్రత్యేక మరమ్మతులకు రూ.2.10 కోట్లు. వల్లూరు నుంచి కోరుమిల్లి రోడ్డు 17.20 కి.మీ.కు రూ.మూడు కోట్లు.

ముమ్మిడివరం: మురమళ్ల నుంచి ఎదుర్లంక వరకూ 6.39 కిలోమీటర్లకు రూ.1.50 కోట్లు. పల్లంకుర్రు నుంచి బలుసుతిప్ప 5.30 కి.మీ. రోడ్డుకు, కందికుప్ప నుంచి కందికుప్ప సముద్రతీరం కిలోమీటరు రోడ్డుకు, అనాతవరం నుంచి పల్లంకుర్రు 4.195 కి.మీ. రోడ్డుకు రూ.3.70 కోట్లు. కొమరగిరి నుంచి ఐ.పోలవరం వరకూ 8.8 కి.మీ. రోడ్డుకు రూ.1.90 కోట్లు. కొండాలమ్మ చింత నుంచి బాలయోగి గుడి రోడ్డు 1.02 కిలోమీటర్లకు 1.75 కోట్లు.

కొత్తపేట: నార్కెడ్‌మిల్లి నుంచి తాడిపూడి వరకూ 1.10 కి.మీ. రోడ్డుకు రూ.45 లక్షలు. పలివెల నుంచి పల్లిపాలెం 1.10 కి.మీ., లొల్ల నుంచి ఉచ్చిలి వరకు 0.9 కి.మీ., కొత్తపేట నుంచి ఈతకోటకు 1.80 కి.మీ., వెదిరేశ్వరం నుంచి దేవరపల్లి 2.16 కిలోమీటర్ల రోడ్లకు 2.50 కోట్లు.

పి.గన్నవరం: పుల్లేటికుర్రు నుంచి అంబాజీపేట 3.547 కి.మీ. రోడ్డుకు రూ.రెండు కోట్లు.

రామచంద్రపురం: కాజులూరు నుంచి తాళ్లరేవు 4.2 కి.మీ.కు రూ.2.20 కోట్లు.

అమలాపురం: అమలాపురం- బెండమూర్లంక 5.629 కి.మీ. రహదారికి రూ.1.50 కోట్లు. ముక్కామల నుంచి ఈదరపల్లి (ముసలపల్లి, పాలగుమ్మి, బండారులంక) 4.49 కి.మీ. రోడ్డుకు రూ.2.10 కోట్లు.



అభివృద్ధి చేయనున్న ద్వారపూడి- యానాం రోడ్డు

సాధ్యమైనంత త్వరగా పనులు



ఆర్‌అండ్‌బీ పరిధిలోని ప్రధాన స్టేట్ హైవేలు, జిల్లాలో రోడ్లకు సంబంధించి మరమ్మతులు, ఆధునీకరణ పనులకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది. ఈ పనులకు నెలాఖరు నాటికి టెండర్లు పిలుస్తున్నాం. టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే సాధ్యమైనంత త్వరగా పనులు మొదలు పెడతాం.

–బి.రాము, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఆర్‌అండ్‌బీ

స్టేట్ హైవేలకు కేటాయింపులు

రాజోలు: కాకినాడ - అమలాపురం - నర్సాపురం ఫెర్రీ (కేఎస్‌ఎఫ్) 5.4 కి.మీ. రోడ్డు మరమ్మతులకు రూ.మూడు కోట్లు కేటాయించారు.

మండపేట: మండపేట బైపాస్ రోడ్డును 4.37 కి.మీ. పొడవున రూ.మూడు కోట్లతో, ద్వారపూడి - యానాం రోడ్డు పది కిలోమీటర్లకు రూ.నాలుగు కోట్లు, అలాగే మండపేట –జొన్నాడ రోడ్డు 13.932 కి.మీ.కు రూ.2.75 కోట్ల చొప్పున మంజూరు చేశారు.

పి.గన్నవరం: అంబాజీపేట- పి.గన్నవరం మధ్య 6.595 కిలోమీటర్ల రోడ్డుకు రూ.నాలుగు కోట్లు, కొత్తపేట వంతెన నుంచి ముక్తేశ్వరం వంతెన వరకూ 5.130 కిలోమీటర్లకు రూ.మూడు కోట్లు, కాకినాడ నుంచి నర్సాపురం ఫెర్రీ (కేఎస్‌ఎఫ్) రోడ్డు 4 కి.మీ.కు రూ.2.20 కోట్లు ఇచ్చారు.

అమలాపురం: కాట్రేనికోన నుంచి ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి వరకూ 7.70 కి.మీ రోడ్డు నిర్మాణానికి రూ.2.60 కోట్లు వెచ్చించనున్నారు.

కొత్తపేట: అమలాపురం- బొబ్బర్లంక రోడ్డు వరకూ 5 కి.మీ. పొడవున రూ.4 కోట్లతో రోడ్డు నిర్మించనున్నారు.



కాట్రేనికోన - చల్లపల్లి రోడ్డు



మండపేట బైపాస్ రోడ్డు

పరిశీలిద్దాం.. పరిష్కరిద్దాం

- అర్జీలపై సత్వరం స్పందించండి
- అధికారులతో కలెక్టర్ హిమాన్షు శుక్లా



స్పందనలో అర్జీదారు అందించిన ఫిర్యాదు పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల ద్వారా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి స్పందన నిర్వహించారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, ఐసీడీఎస్ పీడీ సత్యవాణి ప్రజల నుంచి 256 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకంలో పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పింఛన్లు, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించిన సమస్యలపై అర్జీలు వచ్చాయన్నారు. వీటిని నిర్దేశించిన గడువులోగా పరిష్కరించే విధంగా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని అన్నారు. పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ ఎస్.సుధాసాగర్, డీఎస్‌ఓ ఎ.పాపారావు, డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్, డీసీ హెచ్ఎస్ పద్మశ్రీరాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.దుర్గారావు దొర, జిల్లా గృహ నిర్మాణ సంస్థ అధికారి సీహెచ్ బాబూరావు, డీఈవో ఎం.కమలకుమారి పాల్గొన్నారు.

పోలీసు 'స్పందన'కు 25 అర్జీలు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక– స్పందన కార్యక్రమానికి 25 అర్జీలు వచ్చాయి. కొందరు అర్జీదారులు తమ కుటుంబ, ఆస్తి తగాదాలు, వివాదాలపై జిల్లా ఎస్పీ సుసరావు శ్రీధర్‌కు ఫిర్యాదు చేసి తమకు న్యాయం చేయాలని అభ్యర్థించారు. వచ్చిన ఫిర్యాదుల్లో కొన్నింటిని ఎస్పీ అక్కడిక్కడికే పరిష్కరించారు. మరికొన్ని సమస్యల పరిష్కారానికి ఆయా ప్రాంతాల డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో మాట్లాడి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఎస్పీ కార్యాలయ స్పెషల్ బ్రాంచి సీఐ కోలా రజనీకుమార్, డీసీఆర్‌బీ ఎస్సై గంగాభవాని పాల్గొన్నారు.

భూ రీసర్వే లక్ష్యాలను చేరుకోండి

అధికారులకు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాలు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వేను పారదర్శకంగా చేపట్టి, నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఆయా డివిజన్లలోని అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. భూ సర్వే, ప్రభుత్వ ప్రాధాన్య భవన నిర్మాణాలు, పంట కాలువల్లో వ్యర్థాల తొలగింపు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష రీసర్వేలో లోపాల లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆ దిశగా ఎంపీడీఓలు, మండల ప్రత్యేక అధికారులు, పంచాయతీరాజ్ ఇంజినీర్లు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కాలువల శివారు భూములకు సాగునీరు సవ్యంగా అందేలా కాలువల్లో తూడు, పూడికతీత పనులను సక్రమంగా చేపట్టాలన్నారు. డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు, సీపీవో వెంకటేశ్వర్లు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డు ఏడీ ప్రభాకర్, పంచాయతీరాజ్ ఎస్ఈ చంటిబాబు, జిల్లా వ్యవసాయ అధికారి ఎ.బోసుబాబు, జలవనరుల శాఖ ఈఈ బుల్లిరాజు తదితరులు పాల్గొన్నారు.

వీవోఏ కుటుంబానికి చేయూత

గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ గ్రామ సహాయకురాలు మృతి చెందగా తోటి సహాయకులు మానవతా దృక్పథంతో బాధిత కుటుంబాన్ని ఆదుకున్నారు. రాయవరం మండలం మాచవరం -5 గ్రామ సంఘంలో గ్రామ సహాయకురాలిగా పనిచేసిన సబ్బెళ్ల శ్రీలక్ష్మి ఏప్రిల్ 24న అనారోగ్యంతో మరణించింది. ఆమెకు భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రీలక్ష్మి మృతికి 16 మండలాల్లో వీఓఏలు చింతిస్తూ ఆమె పిల్లలకు సహాయం చేయడానికి ముందుకు వచ్చారు. ఒక్కొక్కరూ రూ.250 నుంచి రూ.500 వరకూ సాయం చేసి మొత్తంగా వచ్చిన రూ.3.50 లక్షలను ఇద్దరు కుమార్తెల పేరున బ్యాంకులో డిపాజిట్ చేశారు. ఈ పత్రాలను బాధిత కుటుంబానికి జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు ద్వారా అందజేశారు. డీఆర్‌డీఏ పీడీ శివశంకర ప్రసాద్, ఏపీడీ ఎంఎం జిలాని, డీపీఎం విజయ్ కుమార్, స్వయం సహాయ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం

అన్నవరం: ఆషాఢమాసంలో చివరి రోజు, అమావాస్యను పురస్కరించుకుని బుధవారం రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. హోమంలో దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ దంపతులతో సహా 36 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి ప్రత్యక్షంగానూ, మరో ఇద్దరు రూ.1,116 చొప్పున ఆన్‌లైన్‌లో టిక్కెట్టు కొనుగోలు చేసి పరోక్షంగానూ పాల్గొన్నారు. వేద పండితులు యనమంద్ర శర్మ, గంగాధరబట్ల గంగబాబు, చిట్టింవాసు, ఛామర్తి కన్నబాబు, చెళ్లపల్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ హోమం నిర్వహించారు.

ఇకపై ఆలయం దిగువన మండపంలో..

వనదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే చండీ హోమం, పౌర్ణమి, అమావాస్య పర్వదినాల్లో నిర్వహించే ప్రత్యంగిర హోమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. దీంతో మండపం సరిపోక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో మండపం విశాలం చేయాలని లేకుంటే దిగువన గల సెల్లార్‌లో హోమం నిర్వహించాలని పలువురు భక్తులు కోరారు. ఈ విషయాన్ని పండితులు ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ దృష్టికి తీసుకువెళ్లారు. మండపం దిగువన గల సెల్లార్‌లో హోమగుండం ఏర్పాటు చేసి చండీ, ప్రత్యంగిర హోమాలను నిర్వహించాలని ఈఓ పండితులను ఆదేశించారు.

ఇంటి వద్దకే పౌరసేవలు



లబ్ధిదారుకు ధ్రువపత్రాన్ని అందజేస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

- 'జగనన్న సురక్ష'తో అర్హులకు మేలు
- మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

రామచంద్రపురం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే పౌరసేవలు అందుతున్నాయని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక ముచ్చుమిల్లిలో జగనన్న సురక్ష సభ జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి వేణు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల సేవలను ప్రజలకు ఉచితంగా అందిస్తున్నామని అన్నారు. సుస్థిర పాలన అందించాలనే ఉద్దేశంతో సీఎం జగన్ రాష్ట్రంలో అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి సీఎం జగన్ చరిత్ర సృష్టించారని అన్నారు. గత టీడీపీ హయాంలో పథకాలు పొందాలంటే ప్రహసనంలా ఉండేదని, ఇప్పుడు అర్హుల చెంతకే చేరుతున్నాయని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి పాలనను ప్రజల ముంగిటకు చేర్చారన్నారు. వలంటీర్ వ్యవస్థతో అర్హులందరికీ పథకాలు చేరుతున్నాయన్నారు. ఈ కార్యక్రమాలకు తోడు పాలన మరింత సౌలభ్యంగా ఉండేందుకు జగనన్న సురక్ష తదితర కార్యక్రమాలకు రూపకల్పన చేశారన్నారు. రామచంద్రపురం పట్టణ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. దానికి అనుగుణంగా పట్టణాన్ని సుందరంగా మార్చుతామని మంత్రి స్పష్టం చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, కౌన్సిలర్లు కేతా శ్రీను, కోఆప్షన్ సభ్యుడు మస్తాన్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, నాయకులు కంచుమర్తిబాబూరావు, కొండేపూడి సురేష్ పాల్గొన్నారు.

ఆట.. అంబాజీపేట

- బాలికల బాస్కెట్‌బాల్‌కు కేరాఫ్ అడ్రస్
- ఎనిమిది మంది వర్సిటీ, జాతీయ స్థాయి పోటీలకు ఇప్పటి వరకూ ఎంపిక
- 2003లో ఏయూ జట్టు మొత్తం ఈ ఊరివాళ్లే
- మరోసారి సత్తా చాటుతున్న బాలికలు

అంబాజీపేట: రాష్ట్రంలో కొబ్బరి పేరు చెప్పగానే జిల్లాలోని అంబాజీపేట గుర్తుకు వస్తుంది. ఈ గ్రామం క్రీడాపరంగానూ అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. బాలికల బాస్కెట్‌బాల్ పోటీలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. రాష్ట్ర స్థాయిలో ఈ గ్రామం తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. కొన్నేళ్లుగా అంబాజీపేట జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఎనిమిది మంది బాలికలు జాతీయ, యూనివర్సిటీ స్థాయి పోటీలకు రాష్ట్రం, ఆంధ్రా యూనివర్సిటీ తరఫున ప్రాతినిధ్యం వహించారు. తాజాగా ఇదే పాఠశాలకు చెందిన బాలికలు, బాలుర జట్లు బాస్కెట్‌బాల్ పోటీల్లో మరోసారి సత్తా చాటుతున్నాయి.

మట్టి కోర్టులోనే సాధన

ఈ పాఠశాలలో బాలురు, బాలికలు బాస్కెట్‌బాల్ శిక్షణ పొందేది మట్టి కోర్టులోనే. ఊడిపోయినట్టుగా ఉండే బోర్డులు.. శిథిలస్థితికి చేరిన సిమెంట్ పోల్స్.. గడచిన రెండు దశాబ్దాలుగా ఇదే కోర్టు. ఇక్కడ శిక్షణ పొందిన పలువురు బాలికలు జాతీయ పోటీల్లో పాల్గొని రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. 2000 నుంచి 2005 వరకూ అంబాజీపేట బాలికలు రాష్ట్ర, జాతీయ, యూనివర్సిటీ స్థాయి పోటీల్లో తమ హవా కొనసాగించారు. ఈ పాఠశాలలో ప్రస్తుతం ఎస్ఏ పీఈటీగా ఉన్న కె.ఆదిలక్ష్మి అప్పట్లో ఇదే మైదానంలో శిక్షణ పొంది మూడుసార్లు జాతీయ పోటీలకు, రెండుసార్లు ఇంటర్ యూనివర్సిటీ, మూడుసార్లు యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యారు. ఆంధ్రా యూనివర్సిటీ జట్టు కెప్టెన్‌గా కూడా వ్యవహరించారు. ఇదే పాఠశాలలో ఔట్ సోర్సింగ్ పీఈటీగా పనిచేస్తున్న ఎ.సూరికుమారి సైతం 18 సార్లు జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించారు. వీరు ఉమ్మడి రాష్ట్రంలో రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడం విశేషం. ఇదే పాఠశాలలో చదువుకున్న సుంకర శ్రీచందన, సుంకర సృజన, యెరుబండి సత్యవతి, చల్లా దుర్గమ్మలు జాతీయ, యూనివర్సిటీ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మూడు వందలకు పైగా డిగ్రీ కాలేజీలుండే ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో బాస్కెట్‌బాల్ జట్టుకు కె.ఆదిలక్ష్మి, యెరుబండి సత్యవతిలు అప్పట్లో మూడేళ్ల పాటు ప్రాతినిధ్యం వహించారు. 2003–04లో వీరితో పాటు ఇదే గ్రామానికి చెందిన సుంకర శ్రీచందన యూనివర్సిటీ జట్టుకు ఆడడం విశేషం.

మళ్లీ అప్పటి వైభవం

దశాబ్ద కాలంగా వివిధ కారణాలతో ఈ పాఠశాలలో బాస్కెట్‌బాల్ ఊసే లేకుండా పోయింది. అంతర్జాతీయ క్రీడాకారుడు ఎస్.అప్పలరాజు ఆధ్వర్యంలో మరోసారి బాలికల బాస్కెట్‌బాల్ శిక్షణ ఆరంభమైంది. శిక్షణ మొదలైన ఏడాదిలో మరో ఇద్దరు బాలికలు వివిధ విభాగాల్లో రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడం విశేషం. గత ఏడాది బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర అండర్–14 జట్టుకు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్–14 పోటీలకు మీసాల మౌనిక ఎంపికైంది. కాగా, నిమ్మకాయల ఛరిష్మ సాయి రుత్వి ఎస్‌జీఎఫ్‌కు ఎంపికై అంబాజీపేటకు మరోసారి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చింది. ఉమ్మడి జిల్లాల వారీగా జరుగుతున్న టోర్నీల్లో ఇటు అంబాజీపేట జట్టు తరఫున, అటు ఉమ్మడి తూర్పుగోదావరి జట్టు తరఫున ఆడి పలు విజయాలు సాధిస్తున్నారు. వీరితో పాటు బాలురు సైతం ఇక్కడ శిక్షణ పొందుతూ పలు టోర్నీల్లో సత్తా చాటుతున్నారు. అయితే మట్టి కోర్టులో సాధన చేయాల్సి రావడంపై క్రీడాకారులు కొంత అసంతృప్తి చెందుతున్నారు.



అంబాజీపేట ఉన్నత పాఠశాల మైదానంలో బాస్కెట్‌బాల్ క్రీడలో సాధన చేస్తున్న బాలికలు

మా పాఠశాలకు గర్వకారణం



అంబాజీపేటకు చెందిన బాలికలు రాష్ట్ర, యూనివర్సిటీ జట్లకు ఎంపికవడం మాకు గర్వకారణం. మట్టి కోర్టు అయినా వీరు అద్భుతంగా సాధన చేసి రాణిస్తున్నారు. మౌలిక సదుపాయాలు కల్పిస్తే మా పిల్లలు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారనే నమ్మకం ఉంది.

–కడలి సాయిరాం, గెజిటెడ్ హెచ్ఎం, అంబాజీపేట ఉన్నత పాఠశాల

సీనియర్ల స్ఫూర్తితో..



బాస్కెట్‌బాల్‌లో మా గ్రామానికి మంచి పేరు ఉంది. ఎక్కడ టోర్నీకి వెళ్లినా కోచ్‌లు, రిఫరీలు మా గ్రామంలో సీనియర్ల గేమ్ గురించి చెబుతూంటారు. వారి స్ఫూర్తితో, కోచ్‌ల ప్రోత్సాహంతో బాస్కెట్‌బాల్‌లో శిక్షణ పొందుతున్నాం.

–మీసాల మౌనిక, బాస్కెట్‌బాల్ క్రీడాకారిణి, అంబాజీపేట

క్లుప్తంగా

బోటు బోల్తా: ఒకరి గల్లంతు



కొత్తపాలెం మొగ వద్ద సముద్రంలో బోల్తా పడిన బోటును ఒడ్డుకు తీసుకు వస్తున్న మత్స్యకారులు

కాట్రేనికోన: కొత్తపాలెం మొగప్రాంతంలో బోటు బోల్తా పడటంతో ఒకరు గల్లంతయ్యారు. స్థానిక ఎఫ్‌డీఓ రామకృష్ణ కథనం ప్రకారం.. బలుసుతిప్ప గ్రామానికి చెందిన కర్రి వెంకటేశ్వర్లు, కర్రి శేషాద్రి, పెమ్మాడి సత్యం, తిరుమాని సతీష్, సంగాని సత్తిబాబు, కాలాడి సత్తిబాబులు ఫైబర్ బోటుపై సముద్రంలోకి చేపల వేటకు వెళ్లారు. వేట ముగించుకుని తిరిగి వస్తున్న సమయంలో సోమవారం తెల్లవారు జామున 4 గంటలకు కొత్తపాలెం మొగ ప్రాంతంలో బోటు ప్రమాదం జరిగింది. వరద ఉధృతి, సముద్ర కెరటాల తాకిడికి బోటు బోల్తా పడింది. బోటుపై ఉన్న ఆరుగురు సముద్రంలో ఈత కొట్టుకుంటూ ఒడ్డుకు వచ్చేందుకు ప్రయత్నించారు. ఇందులో ఐదుగురు సురక్షితంగా ఒడ్డుకు చేరారు. కాలాడి సత్తిబాబు (45) కెరటాల ఉధృతికి కొట్టుకుపోయాడని సహచరులు చెబుతున్నారు. వెంటనే బలుసుతిప్ప గ్రామస్తులు, బంధువులకు చెందిన 10 బోట్లపై గాలింపు చర్యలు చేపట్టారు. అయితే సత్తిబాబు ఆచూకీ ఇంకా తెలియ రాలేదు. సత్తిబాబుకు భార్య, కుమారుడు ఉన్నారు. సంఘటనా స్థలానికి మత్స్యశాఖ జేడీ షేక్ అహ్మద్ అలీ, ఎఫ్‌డీఓ రామకృష్ణ వెళ్లి పరిశీలించారు. సత్తిబాబు గల్లంతుపై కాట్రేనికోన ఎస్సై టి.శ్రీనివాస్ మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

తుని: స్థానిక జీఆర్పీ పరిధిలో రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడని రైల్వే ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. దీనిపై సోమవారం తుని రైల్వే స్టేషన్ మాస్టర్ సమాచారం ఇచ్చారన్నారు. ఈ మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించామన్నారు. గౌహతి నుంచి సికింద్రాబాద్ వెళుతున్న సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నుంచి పాయకరావుపేట, నాగరాజుపేట గేటు సమీపంలో జారిపడి 45 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే తుని జీఆర్పీ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

రాత్రిపూట రక్తచరిత

- డ్రైవర్‌పై దుండగుల హత్యాయత్నం, ఆటో లాక్కుని పరారీ
- ఆపై టిఫిన్ సెంటర్‌లో మహిళ హత్య
- తేటగుంట శివారులో సంఘటన

తుని రూరల్: ఎవరో తెలియదు.. ఎక్కడి నుంచి వచ్చారో తెలియదు.. ఇద్దరు దుర్మార్గులు రాత్రిపూట అలజడి రేపారు.. కత్తులతో భయానక వాతావరణం సృష్టించారు.. ఓ డ్రైవర్‌ను కత్తితో పొడవడమే కాకుండా మహిళను అతి కిరాతకంగా హత్య చేశారు. కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంట శివారు ఎర్రకోనేరు జంక్షన్ వద్ద టిఫిన్ సెంటర్‌లో ఆదివారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. దీనిపై రూరల్ సీఐ సన్యాసిరావు కథనం ప్రకారం.. ఆదివారం తొమ్మిది గంటల సమయంలో ఇద్దరు తేటగుంట జంక్షన్‌లో గుంటపల్లి వెళుతున్న ఆటో ఎక్కారు. రాజులకొత్తూరు వద్దకు చేరుకున్న తర్వాత ఆటో వదిలి వెళ్లిపోవాలని అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం గుంటపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ దమ్ము దుర్గారావును బెదిరించారు. దీనికి తిరస్కరించడంతో దుర్గారావును కత్తితో పొడిచి తీవ్రంగా గాయపరిచారు. అనంతరం అతనిని కిందకు తోసేసి ఆటోను తీసుకుని దుండగులు వెళ్లిపోయారు. అక్కడి నుంచి రెండు కిలోమీటర్లు వెళ్లి కాఫీడే దాటిన తర్వాత ఆటోను రోడ్డు పక్కన వదిలి దగ్గరలో ఉన్న బీఎస్‌ఎన్‌ఎల్ సెల్‌టవర్ కొండపైకి చేరుకున్నారు. అక్కడ రెండు గంటల సేపు దాక్కున్నారు. రాత్రి 11.30 గంటల తర్వాత కొండ దిగి ఎర్రకోనేరు వద్దకు వచ్చారు.



జరిగిన ఘటనను పోలీసులకు వివరిస్తున్న నాగమణి

పైసల్ ఇవ్వు అంటూ...

ఆ సెంటర్లో రోడ్డు పక్కనే మూసివేసి ఉన్న టిఫిన్ సెంటర్‌కు వెళ్లారు. హోటల్ ప్రాంగణంలో పప్పు సత్యవతి (55) భోజనం చేస్తుండగా ఆమె కుమార్తె, మనుమడు లోపల నిద్రిస్తున్నారు. సత్యవతిని చూసి పైసల్ ఇవ్వు అంటూ ఆ దుర్మార్గులు బెదిరించారు. 'పైసల్ లేవు ఏమీ లేవు పొండి' అంటుండగానే అప్పటికే టీషర్టులతో ముఖం కనిపించకుండా కట్టుకుని ఉన్న ఇద్దరిలో ఒకడు సత్యవతిని కత్తితో పొడిచాడు. ఆ సమయంలో లోపల నుంచి ఏంటని అడుగుతున్న సత్యవతి కుమార్తె (గత నెలలో కుడి చేయి విరిగి ఉన్న) నాగమణి వద్దకు మరో దుండగుడు వెళ్లి అరవ వద్దంటూ నోరుమూసేశాడు. నాగమణి ఒక చేత్తోనే ప్రతిఘటిస్తుండగా



దుండగులు తీసుకుపోయిన ఆటో

తల్లి సత్యవతి వెనుతిరిగి లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించింది. మొదట కత్తితో దాడి చేసిన దుండగుడు సత్యవతి వీపుపై మరోసారి బలంగా పొడిచాడు. నాగమణి కేకలు వేస్తూ ఉల్లిపాయలు కోసే కత్తి తీసుకుని దుండగుడిని బెదిరించింది. అతను



దుండగుల చేతిలో హత్యకు గురైన పప్పు సత్యవతి (అంతరచిత్రం) సత్యవతి (ఫైల్)

నాగమణి చేతిలో కత్తి లాక్కుని మెడపై పెట్టి చంపేస్తానంటూ అరిచాడు. ఈ అలజడికి పక్కింట్లో ఉంటున్న ఇద్దరు మహిళలు అక్కడకు చేరుకున్నారు. వారిద్దరిని వెళ్లిపోవాలని దుండగులు బెదిరించారు. ఆ మహిళలు వెళ్లిపోయిన వెంటనే అందుబాటులో ఉన్న ఫోన్‌ను తీసుకుని ఆ ఇద్దరూ నీరు లేని ఎర్రకోనేరులోకి దిగి నడిచి వెళ్లిపోయారు. బయటకు వచ్చిన నాగమణి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారొచ్చి అపస్మారక స్థితిలో ఉన్న సత్యవతిని తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రాథమిక విచారణలో దుండగులు ఒడిశా, బిహార్‌లకు చెందిన వారిగా గుర్తించామని పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలానికి కొద్ది దూరంలో రెండు టీ షర్టులు, రెండు టర్కీ తువ్వాళ్లు ఉన్న సంచి వదిలి వెళ్లారు.

సహాయంగా వచ్చి.. తనువు చాలించి..

ఎర్రకోనేరు జంక్షన్‌లో కొన్నాళ్లుగా పదేళ్ల కుమారుడు చింటుతో కలసి నాగమణి టిఫిన్ సెంటర్ నిర్వహిస్తోంది. గత నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె కుడి చేయి విరిగిపోయింది. దాంతో అదే గ్రామంలో ఉంటున్న తల్లి సత్యవతి ఆమెకు సహాయంగా వచ్చింది. ఆ రోజు రాత్రి తుని నుంచి హోటల్‌కు వస్తుండగా ఆటో డ్రైవర్‌ను ఎవరో కత్తితో పొడిచేశారన్న విషయం తెలిసిందని నాగమణి చెప్పింది. వెంటనే మెడలోని బంగారు నగలను తీసేసి లోపల భద్రపర్చామంది. తన తల్లి భోజనం చేస్తుండగా కుమారుడితో కలసి లోపల నిద్రించానని తెలిపింది. 11.30 గంటల తర్వాత దుండగులు డబ్బు కోసం వచ్చి తన తల్లిని అతి కిరాతకంగా హత్య చేశారని నాగమణి పోలీసుల వద్ద వాపోయింది. గతేడాది తండ్రి తాతబ్బాయి మరణించగా, ఇప్పుడు ఇలా తల్లి మరణించిందని బోరున విలపించింది. ఈ సంఘటనతో ఆ ప్రాంతమంత ఒక్కసారిగా ఉలిక్కిపడింది.

క్లూస్ టీమ్ ఆధారాల సేకరణ

సంఘటనా స్థలానికి కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, ఏఎస్పీ శ్రీనివాస్, పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి, రూరల్ సీఐ సన్యాసిరావు, ఎస్సై విజయబాబు, పట్టణ సీఐ నాగదుర్గారావు, కోటనందూరు, తొండంగి ఎస్సైలు స్వామినాయుడు, శివకుమార్ చేరుకున్నారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. డ్రైవర్ నుంచి లాక్కున్న ఆటోను, దుండగులు వదిలి వెళ్లిన దుస్తులను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తునకు ఐదు ప్రత్యేక బృందాలను నియమించారు. రూరల్ ఎస్సై ఆధ్వర్యంలో ఓ బృందం ఒడిశా వెళ్లనుంది. మిగిలిన నాలుగు బృందాలు సమీపంలో సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్నారు. సెల్ సిగ్నల్స్‌ను గుర్తిస్తున్నారు. తుని, అన్నవరం, సమీప పట్టణాల్లో లాడ్జిలలో తనిఖీలు చేస్తున్నారు.

ఫిజిక్స్ టీచర్స్ అసోసియేషన్‌తో 'నన్నయ' ఒప్పందం

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్టుమెంట్ ఆఫ్ ఫిజిక్స్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ ఆర్సీ 11 ఏపీ చాప్టర్‌కు మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. స్థానిక యూనివర్సిటీ సెమినార్ హాలులో 'ఎక్స్‌ప్లోరింగ్ ది సినర్జీ: ఫిజిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ' అనే అంశంపై సోమవారం గెస్ట్ లెక్చర్ కార్యక్రమం జరిగింది. దీనికి రిసోర్స్‌పర్సన్‌గా హాజరైన ఐఏపీటీ ఆర్‌సీ-11 సెక్రటరీ ఆచార్య జి.సహాయ భాస్కరన్‌తో నన్నయ వీసీ ఆచార్య కె.పద్మరాజు ఇందుకు సంబంధించిన ఒడంబడిక పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఇంజినీరింగ్‌కు మూలం ఫిజిక్స్ అని, ఫిజిక్స్‌లోని మూలాలను అన్వేషిస్తే శాస్త్రవేత్తల కృషి అర్థమవుతుందన్నారు. ప్రభుత్వాలు కూడా ఆయా విభాగాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపించేలా విద్యార్థులకు అవకాశాలను కల్పిస్తున్నాయన్నారు. విద్యార్థులంతా ఫిజిక్స్‌పై పట్టు సాధిస్తే భవిష్యత్‌లో మంచి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. ఈ ఒప్పందం ద్వారా వివిధ ఉమ్మడి కార్యకలాపాలు, విద్యార్థులు, ప్రజలలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం, ఫిజిక్స్‌లో జాతీయ స్థాయి పరీక్షలను ప్రోత్సహించడం, ఏపీలోని పాఠశాలలు, కళాశాలలో ఫిజిక్స్/సైన్స్ ఉపాధ్యాయుల అభివృద్ధి,



ఒడంబడిక పత్రాలను మార్చుకుంటున్న నన్నయ వీసీ, ఐఏపీటీఆర్‌సీ-11 సెక్రటరీ

శిక్షణా కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడం, అకడమిక్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్స్ తదితరాలు నిర్వహించేందుకు అవకాశం ఉంటుందన్నారు. రిసోర్స్‌పర్సన్ ఆచార్య సహాయ భాస్కరన్ మాట్లాడుతూ డేటా మేనేజ్‌మెంట్‌లో మాగ్నటిక్, ఆప్టికల్ స్టోరేజ్ ప్రాముఖ్యతతో పాటు డిజిటలైజేషన్ వెనుక ఉన్న ఫిజిక్స్ భావనలను వివరించారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇటీవల ఎంతో పురోగతిని సాధించామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.విజయనిర్మల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.సురేష్‌వర్మ, ప్రోగ్రామ్ కన్వీనర్ డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి, ఆచార్య వై.శ్రీనివాసరావు, డాక్టర్ కె.రమణేశ్వరి, డాక్టర్ పి.వెంకటేశ్వరావు, డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

ఐటీఐల్లో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు

రాయవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల పరిధిలోని ప్రభుత్వ ఐటీఐల్లో రెండో విడత ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ విషయాన్ని కాకినాడ, ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ ఎంవీజీ వర్మ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2022-23 సంవత్సరానికి ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 31వ తేదీ లోపు ఏదైనా ఆన్‌లైన్ సెంటర్ నుంచి దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు అనంతరం అభ్యర్థి సమీపంలోని ప్రభుత్వ ఐటీఐల్లో ఆగస్టు ఒకటవ తేదీలోగా ఒరిజినల్ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకుని అప్రూవ్ చేయించుకోవాలన్నారు. లేకుంటే అభ్యర్థి పేరు మెరిట్ జాబితాలో అనర్హులుగా కనిపిస్తుందన్నారు. దరఖాస్తు చేసుకునేటప్పుడు ఏవైనా సందేహాలు వస్తే 0884 2348182, 94946 88516 ఫోన్ నంబరులలో సంప్రదించాలన్నారు. దరఖాస్తు సమయంలో అభ్యర్థి చేరదలచుకున్న ప్రభుత్వ/ప్రైవేట్ ఐటీఐలను తప్పనిసరిగా ఆప్షన్ పెట్టుకోవాలన్నారు. ఆగస్టు 3, 4 తేదీల్లో ప్రభుత్వ ఐటీఐలు, ఆగస్టు 5 నుంచి 7వ తేదీ వరకు ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశం కోసం కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు.

చిన్న కుటుంబానికి పెద్దకష్టం

- పంట కాలువలో పడి యువకుడి మృతి
- ఆధారం కోల్పోయిన తల్లి, నాన్నమ్మ

అమలాపురం టౌన్: అంధురాలైన తల్లి.. వృద్ధాప్యంలో ఉన్న నాన్నమ్మ పోషణకు ఆ యువకుడే ప్రధాన ఆధారం. విధి వక్రించడంలో ఆ కుటుంబం ఏకైక దిక్కును కోల్పోయింది. అమలాపురం గాంధీనగర్ శివారు శాయంపేటకు చెందిన బీర చిరంజీవి (28) ప్రమాదవశాత్తు పంట కాలువలో పడి మృతి చెందడంతో ఆ తల్లి, నాన్నమ్మలు తల్లడిల్లిపోతున్నారు. తమకు ఆధారం ఎవరంటూ అల్లాడిపోతున్నారు. కూలి పనులు చేస్తూ చిరంజీవి ఆ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం తన ఇంటి నుంచి దుస్తులు ఉతుక్కునేందుకు కాలువ పాంచాలకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి కాలువలో పడిపోయి ప్రాణాలు విడిచి ఉంటాడని స్థానికులు నిర్ధారణకు వచ్చారు. చిరంజీవి కాలువలో మునిగిపోతున్నప్పుడు ఎవరూ గమనించ లేదు. అతనికి వివాహం కాలేదు. తండ్రి కొన్నేళ్ల కిందట గోడ కూలిన ప్రమాదంలో మృతి చెందాడు. తల్లి కనకదుర్గ అంధురాలు. నానమ్మ (85) సరస్వతమ్మ వృద్ధురాలు. వీరి ఆలనాపాలన ఆ యువకుడే



పంట కాలువలో పడి మృతి చెందిన చిరంజీవి

చూసుకుంటున్నాడు. దుస్తులు ఉతుక్కునేందుకు వెళ్లిన మనమడు ఎంతకీ తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చి స్థానికుల సాయంతో కాలువలో సరస్వతమ్మ వెతికారు. కాలువ పాంచాల వద్దే నీటి ఊబిలో కూరుకుపోయినట్లుగా ఉండి ప్రాణాలు విడిచాడు. కూలీ నాలీ చేసుకుంటూ ఆ ఇంటికి ఆధారంగా ఉన్న చిరంజీవి మృతితో అంధురాలైన తల్లి, వృద్ధురాలైన నానమ్మ బోరున విలపిస్తున్నారు. నానమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అమలాపురం పట్టణ పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పట్టణ వైఎస్సార్ సీపీ గృహ సారథుల కన్వీనర్ ఈతకోట శ్రావణ్‌కుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

నైపుణ్యాభివృద్ధిరస్తు

- 12 సామర్థ్యాల్లో హెచ్‌ఎంలకు శిక్షణ
- వేదికగా సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల

రాయవరం: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపునకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోంది. ప్రధానోపాధ్యాయుల్లోనూ నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి శిక్షణ తరగతులను పాఠశాల విద్యాశాఖ నిర్వహిస్తోంది. సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్)లో భాగంగా ఆరు రోజుల రెసిడెన్షియల్ ట్రైనింగ్ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల దీనికి వేదిక కానుంది. ఇక్కడ పశ్చిమగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రంపచోడవరం డివిజన్, అలాగే తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలకు చెందిన హెచ్‌ఎంకు శిక్షణ ఉంటుంది. బ్యాచ్‌కు 300 మంది చొప్పున తొలుత ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు తరగతులు ఉంటాయి. అనంతరం ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలకు శిక్షణ ఇస్తారు. ఏలూరు జిల్లా అగిరిపల్లిలో శిక్షణ పొందిన 19 మంది మాస్టర్ ట్రైనీలు అవగాహన కల్పించనున్నారు. ఉదయం 5.30 గంటల నుంచి రాత్రి వరకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తారు. వారికి అవసరమైన



శిక్షణతో పాటు, మానసికోల్లాసానికి ఆటలు, పాటలు, యోగా, ధ్యానం తదితర అంశాల్లో ప్రవేశం కల్పిస్తారు. ట్రైనింగ్‌కు ముందు, ట్రైనింగ్ అనంతరం టెస్ట్‌లను నిర్వహించి, వారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటారు. అలాగే వివిధ పద్ధతుల ద్వారా నిరంతర సమగ్ర మూల్యాంకనం చేసి, వారిలో నాయకత్వ పెంపుదల సూచీని అభివృద్ధి చేస్తారు. కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ కోర్సు కోఆర్డినేటర్‌గా, ఏఎంవో ఎంవీ రామారెడ్డి శిక్షణా శిబిరం ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ మేనేజ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ (సీమాట్) పర్యవేక్షణలో రెసిడెన్షియల్ ట్రైనింగ్ ఇవ్వనున్నారు.

శిక్షణ అంశాలు ఏంటంటే..

2026 నాటికి పాఠశాల ప్రధానోపాధ్యాయుల్లో నాయకత్వ సామర్థ్యాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఈ శిక్షణ ద్వారా రాష్ట్ర విద్యా శాఖ కృషి చేస్తోంది. స్వీయ అవగాహన, స్వీయ నిర్వహణ, పాఠ్యాంశాల బోధన నిర్వహణ, అభ్యాస సంస్కృతిని ప్రోత్సహించడం, పరిశీలన మరియు అభిప్రాయం, డేటా ఆధారిత దిశలు, పాఠశాల వనరుల నిర్వహణ, ఆర్థిక వనరుల నిర్వహణ, కమ్యూనికేషన్ ప్రభావం, సంఘర్షణ నిర్వహణ, సహకారాన్ని నిర్మించడం వంటి అంశాల్లో శిక్షణ ఇస్తారు. అలాగే పాఠశాల భద్రత, వాతావరణ మార్పు అంశాలపైనా అవగాహన కల్పిస్తారు. పాఠశాలల్లోని అవసరాలు, విశ్లేషణ ఆధారంగా సామర్థ్యాలను రెండు లెర్నింగ్ సైకిల్స్‌లో నేర్పిస్తారు. విపత్తు సమయాల్లో నిర్వహణ, పాఠశాల భద్రత అంశాల్లో ప్రధానంగా శిక్షణ ఉంటుంది.

సద్వినియోగం చేసుకోండి



పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడే నాయకుడు. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో వారి పాత్ర కీలకమైంది. సాల్ట్ ప్రాజెక్టులో భాగంగా గతంలో ఎన్నడూ లేని విధంగా ఆరు రోజుల రెసిడెన్షియల్ ట్రైనింగ్‌ను సమగ్ర శిక్ష తరపున నిర్వహిస్తున్నాం. ప్రతి ప్రధానోపాధ్యాయుడు ఈ శిక్షణను వినియోగించుకుని విద్యాభివృద్ధికి దోహదపడాలి.

–జి.నాగమణి, రీజినల్ జాయింట్ డైరెక్టర్, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

జార్జియాలో వైద్య విద్యార్థి అదృశ్యం

కలత చెందుతున్న తల్లిదండ్రులు



హేమంత్ అశ్విన్ ఆకాష్

అలమూరు: జార్జియా దేశంలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి సిడిగం హేమంత్ అశ్విన్ ఆకాష్ (21) అదృశ్యమయ్యాడు. ఆ వివరాల్లోకి వెళితే.. ఆలమూరు పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న సత్యనారాయణ (నాయుడు) తన ద్వితీయ కుమారుడైన హేమంత్‌ను 2022లో హైదరాబాద్‌కు చెందిన వీ సోర్స్ కన్సల్టెన్సీ ద్వారా జార్జియాలోని ఇల్లియా స్టేట్ గవర్నమెంట్ మెడికల్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ చదివేందుకు చేర్పించారు. అప్పటి నుంచి కన్సల్టెన్సీ ఏర్పాటు చేసిన హాస్టల్‌లో ఉంటూ చదువుకుని సెలవులపై తరచూ స్వగ్రామైన ఆలమూరుకు హేమంత్ వస్తుండేవాడు. సోమవారం రాత్రి తొమ్మిది గంటలకు స్వగ్రామానికి వచ్చేందుకు రానూ పోనూ విమాన టిక్కెట్లు తీసుకున్నాడు. హేమంత్‌కు చెందిన మొబైల్ ఫోన్ ఆదివారం రాత్రి నుంచి పనిచేయడం లేదు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు ఫోన్ చేస్తున్నా స్పందన లేకపోవడంతో ఆందోళన చెంది వీ సోర్స్ కన్సల్టెన్సీని సంప్రదించారు. దీంతో హాస్టల్‌లో ఉంటున్న సహచర విద్యార్థులను ఆ కన్సల్టెన్సీ సంప్రదించగా స్థానిక బీచ్‌కు వెళతానని చెప్పి ఒక్కడే బయటకు వెళ్లిపోయాడని, తరువాత తమకు కనిపించలేదని చెప్పడంతో తల్లిదండ్రులు సత్యనారాయణ, లలిత దంపతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దీనిపై జిల్లా ఎస్పీ శ్రీధర్‌కు ఫిర్యాదు చేయగా ఆయన సత్వరమే స్పందించి విదేశాంగ శాఖ దృష్టికి తీసుకు వెళ్లినట్లు సమాచారం.

స్నేహితులపై అనుమానం

తమ కుమారుడు హేమంత్ అవినాకాష్ కనిపించకుండా పోయి 24 గంటలైనా ఇప్పటి వరకూ హాస్టల్ నిర్వాహకులు, సహచర విద్యార్థులు స్పందించలేదని తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. తన కుమారుడు కనిపించకుండా పోవడానికి సహచర విద్యార్థుల్లో కొంతమంది కారణమని వారు ఆరోపిస్తున్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తన కుమారుడి ఆచూకీ తెలపాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.